నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ మంగళవారం 5 నవంబర్ 2024 | ADILABAD NIRMAL

## పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

నిర్మల్ అర్బన్, నవంబర్ 4 : ఐదు నెలలుగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని కోరు తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మా ట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు చెల్లించకుండా కాలయాపన చేస్తూ వారిని ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు.

## మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

అరెస్టయిన మాజీ సర్పంచ్‌లు

నర్సాపూర్ (జీ), నవంబర్ 4 : మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా సోమవారం తెల్లవారుజామున అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాకు మాజీ సర్పంచ్‌లు వెళ్లకుండా అడ్డుకున్నారు. అక్రమంగా అరెస్ట్ చేసి సమస్యలను పక్కదారి పట్టించడం తగదని మాజీ సర్పంచ్‌లు అన్నారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌లు రాంరెడ్డి, చెన్న మహేశ్, సురేశ్, పోశెట్టి, గోవింద్ ఉన్నారు.

అక్టోబర్ 29వ తేదీన ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

### ఎమ్మెల్యే ప్రారంభించినా..
# కొనుగోళ్లు షురూ కాలే

- ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం
- ఖానాపూర్ మార్కెట్ యార్డులో తూకం వేయని వైనం
- విక్రయానికి తీసుకొచ్చిన రైతుల ఆగ్రహం

ఖానాపూర్, నవంబర్ 4 : ఖానాపూర్ మార్కెట్ యార్డులో అక్టోబర్ 29వ తేదీన ధాన్యం కొనుగోళ్లను స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు. కేంద్రాన్ని ప్రారంభించి వారం రోజులు గడిచినా ఇప్పటికీ ధాన్యాన్ని తూకం వేయలేదు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఇప్పుడు ఇవ్వాల్సి వస్తుందని కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. ప్రభుత్వ వైఖరి వల్ల రైస్ మిల్లర్లకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన చెందుతున్నారు. ధాన్యాన్ని కుప్పలుగా పోసి ఎప్పుడు కొంటారో తెలియక దళారులను ఆశ్రయిస్తూ క్వింటాలుకు రూ.1800కే అమ్ముకుంటే నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం చిత్త శుద్ధితో రైతులపై ప్రేమ ఉంటే.. వెంటనే దొడ్డు, సన్న రకాలను కొనుగోళ్లు చేసి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు.

ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యాన్ని కుప్పలుగా పోసిన రైతులు

# తగ్గిన పత్తి ధర

**క్వింటాలుకు రూ.7,010 చొప్పున ప్రైవేటు వ్యాపారుల కొనుగోళ్లు**

- సీసీఐ కొనుగోళ్లు అంతంత మాత్రమే..
- తేమ పేరిట నిరాకరణ
- ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్న రైతులు

తేమ శాతం పరిశీలిస్తున్న సీసీఐ సిబ్బంది

ఆదిలాబాద్, నవంబర్ 4(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా రైతులు ఈ ఏడాది పత్తి విక్రయాల్లో ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 ఉండగా.. పంటను కొనుగోలు చేయాల్సిన సీసీఐ తేమ పేరిట పంటను సేకరించడం లేదు. జిల్లాలో పది రోజుల కిందట కొనుగోళ్లు ప్రారంభం కాగా.. 39,921 క్వింటాళ్ల కొనుగోళ్లు జరిగాయి. ఇందులో ప్రైవేటు వ్యాపారులు 32,745 క్వింటాళ్లు, సీసీఐ 7,176 క్వింటాళ్ల పత్తిని సేకరించాయి. కొనుగోళ్లు ప్రారంభమైనప్పటి నుంచి తేమ శాతం రైతులకు శాపంగా మారింది. నిబంధనల ప్రకారం.. పత్తిలో 8 శాతం తేమ ఉంటేనే మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 చెల్లిస్తామని సీసీఐ అధికారులు అంటున్నారు. 9 శాతం ఉంటే రూ.7,445, 10 శాతం ఉంటే రూ.7,370, 11 శాతం ఉంటే రూ.7,295, 12 శాతం ఉంటే రూ.7,220 ధర చెల్లిస్తున్నారు. 12 శాతానికి పైన తేమ ఉంటే కొనుగోలు చేయడానికి నిరాకరిస్తున్నారు. 13 శాతం వచ్చిన రైతులు ఎంత బతిమిలాడిన సీసీఐ అధికారులు కనికరించడం లేదు.

### ప్రైవేటు వ్యాపారులే దిక్కు..

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లించాల్సిన సీసీఐ తేమ పేరిట పత్తిని కొనుగోలు చేయడానికి నిరాకరిస్తుండడంతో రైతులు పంటను ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తుంది. బుధవారం వ్యాపారులు 8 శాతం తేమతో క్వింటాలుకు రూ.7,120 చెల్లించి కొనుగోలు చేశారు. నాలుగు రోజుల సెలవుల తర్వాత సోమవారం కొనుగోళ్లు తిరిగి ప్రారంభం కాగా వ్యాపారులు ఒక్కసారిగా రూ. 110 తగ్గించి 8 శాతం తేమతో క్వింటాలుకు రూ.7,010 చొప్పున కొనుగోళ్లు జరుపుతున్నారు. సీసీఐ 12 శాతం కంటే ఎక్కువ తేమ ఉంటే కొనుగోలు చేయకపోవడంతో 13 శాతానికి పైగా తేమ వచ్చిన రైతులు ప్రైవేటు వ్యాపారులకు పంటను అమ్ముకుంటున్నారు. 13 శాతం తేమ ఉంటే వ్యాపారులు రైతులకు రూ. 6,730 చెల్లిస్తున్నారు. 14 శాతం ఉంటే రూ.6,660, 15 శాతం ఉంటే రూ.6,590, 16 శాతం తేమ ఉంటే రూ. 6,520 చెల్లిస్తున్నారు. పత్తిలో 16 శాతం తేమ ఉన్న రైతులు క్వింటాలుకు రూ.1000 చొప్పున నష్టపోతున్నారు. పత్తి ప్రారంభంలో తేమ శాతం 15 నుంచి 18 ఉంటుందని, ప్రస్తుతం ప్రైవేటు కొనుగోళ్లతో భారీగా నష్టం జరుగుతుందని రైతులు అంటున్నారు. సీసీఐ ఆధ్వర్యంలో కనీసం 15 శాతం తేమ వరకు కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి తూకం



**క్వింటాలుకు సీసీఐ పెడుతున్న ధర**

| తేమ శాతం | ధర |
|---|---|
| 8 | రూ.7,521 |
| 9 | రూ.7,445 |
| 10 | రూ.7,370 |
| 11 | రూ.7,295 |
| 12 | రూ.7,220 |
| 13 | రూ. 6,730 |
| 14 | రూ.6,660 |
| 15 | రూ.6,590 |
| 16 | రూ. 6,520 |

# సమస్యలు పరిష్కరించండి సారూ..

- ప్రజావాణిలో 84 దరఖాస్తులు
- పరిష్కరించాలని కలెక్టర్ సూచన

ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, నవంబర్ 4(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తమ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రాలు అందజేశారు. గత సోమవారం బీసీ కమిషన్ పర్యటన సందర్భంగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించలేదు. వివిధ సమస్యలపై 84 దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించిన కలెక్టర్ అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

### పింఛన్లు మంజూరు చేయాలి

తమ గ్రామంలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్లకు అర్హులైన వారు 50 మంది వరకు ఉంటారని వారికి పింఛన్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భీంసరి గ్రామానికి చెందిన వృద్ధులు, వితంతువులు ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అన్ని విధాలుగా అర్హులుగా ఉన్నామని, పింఛన్ల కోసం దరఖాస్తులు ఇచ్చినట్లు వారు తెలిపారు.

### అధికారులు అవగాహన కల్పించాలి..

ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆదిలాబాద్ పట్టణంలోని హోటల్, రెస్టారెంట్, స్వీట్ హౌస్ నిర్వాహకులకు అవగాహన కల్పించాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గంధ్రత్ సంతోష్ కోరారు. హోటల్ యజమానులతో కలిసి ప్రజావాణిలో ఆయన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఉన్నత చదువులు చదువుకుని ఉపాధి కోసం హోటళ్లు, రెస్టారెంట్‌లు నడుపుతున్నామని, వ్యాపారం సరిగా లేక అద్దెలు చెల్లించలేక పోతున్నామన్నారు. అధికారులు తినుబండారాలు, ఆహార పదార్థాల్లో నాణ్యత లేదని ప్రకటనలు చేస్తున్నారన్నారు. దీంతో వినియోగదారులు తమపై నమ్మకం కోల్పోతున్నారని తెలిపారు.

నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

## అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యం

**మాజీ మంత్రి జోగు రామన్న**

ఎదులాపురం, నవంబర్ 4 : ఆధ్యాత్మికంతో పాటు అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతను బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. సోమవారం పట్టణంలోని శాంతినగర్‌లో గల హనుమాన్ ఆలయంలో కమిటీ హాల్ నిర్మాణానికి మాజీ మంత్రి జోగు రామన్న, కాలనీవాసులతో కలిసి భూమిపూజ చేశారు. కాలనీవాసులు రామన్నను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. యాదాద్రి, నాగోబా ఆలయంతోపాటు లోక కల్యాణార్థం యాగాలు నిర్వహించింది కేసీఆర్ మాత్రమేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవన్న, బట్టు సతీశ్, ఆశన్న, శ్రీనివాస్, దినేశ్, హనుమండ్లు, వేదవ్యాస్, వెంకటరెడ్డి, సంతోష్, కృష్ణ, నర్సాగౌడ్, పవన్, ఇబ్బు పాల్గొన్నారు.

# గ్రిల్ నైన్ హోటల్‌లో ఫుడ్ పాయిజన్

నిర్మల్ అర్బన్, నవంబర్ 4 : అపరిశుభ్ర వాతావరణంలో హోటల్‌ను నిర్వహిస్తూ శుచి, శుభ్రత పాటించకపోవడం, నాసిరకం వస్తువులతో ఆహార పదార్థాలు వండడంతో వాటిని తిన్న ప్రజలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇలాంటి ఘటనే ఆదివారం నిర్మల్ పట్టణంలో చోటు చేసుకుంది. నిర్మల్ పట్టణంలోని శాస్త్రీనగర్ కాలనీలోని గ్రిల్ నైన్ హోటల్‌లో భోజనం చేసిన పలువురికి ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం వాంతులు, విరేచనాలు అయ్యాయి. తీవ్ర అస్వస్థతకు గురైన 13 మంది ప్రభుత్వ ఆసుపత్రి, స్థానిక ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరారు. ఇందులో ఏడుగురు సోమవారం డిశ్చార్జి అయ్యారు. మరి కొంత మంది చికిత్స పొందుతున్నారు. హోటల్‌లో ఆహారం తిన్న తర్వాతనే తమకు వాంతులు, విరేచనాలు అయ్యాయిని రోగులు చెబుతున్నారు. తమ హోటల్‌లో తిన్న ఆహార పదార్థాలతో ఫుడ్ పాయిజన్ కావడంతో హోటల్‌ను యాజమాన్యం తెరవలేదు.

దవాఖానలో చికిత్స పొందుతున్న ఫుడ్ పాయిజన్ బాధితులు

ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

## సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

**నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్**

నిర్మల్ అర్బన్, నవంబర్ 4 : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదుల విభాగంలో విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్, ధరణి, భూసమస్యలు, రెండు పడకల గదుల ఇండ్ల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈనెల 6వ తేదీలోగా పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటు కోసం నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇందులో అదనపు కలెక్టర్‌లు కిశోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

## ఎంఎల్‌సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 4 : ఉపాధ్యాయ, పట్టభద్రులు తప్పనిసరిగా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఓటు నమోదుకు నవంబర్ 6వ తేదీతో గడువు ముగుస్తుందన్నారు. అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా రెండు విధాలుగా తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. నవంబర్ 23 న ఓటరు ముసాయిదా విడుదల అవుతుందన్నారు. ఈ జాబితాపై డిసెంబర్ 9 తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. డిసెంబర్ 30 న ఎమ్మెల్సీ ఓటరు తుది జాబితా విడుదల చేస్తారు.

### ఈవీఎంల గోదాం పరిశీలన

కలెక్టర్ కార్యాలయ సమీపంలోని ఈవీఎం గోదాంను సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈవీఎం గోదాం వద్ద భద్రత సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు. గోదాం నిర్వహణపై అధికారులకు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

## సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

ఎదులాపురం, నవంబర్ 4 : సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పారదర్శకంగా, తప్పులకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ఎన్యూమరేటర్లు మున్సిపల్ గ్రామస్థాయిలో వార్డు నుంచి మొదలుకుని కేటాయించిన బ్లాక్ స్థాయి వరకు పూర్తిస్థాయిలో సమాచార సేకరణ, నమోదును అత్యంత జాగ్రత్తగా నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వేకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, అలాగే సర్వే నిర్వహణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. ఈ సర్వేలో అందరిని భాగస్వామ్యం చేయాలని, ఈ రోజు ఎన్యూమరేటర్లుగా నియమించిన టీచర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, బుధవారం నుంచి ప్రారంభం కానున్న సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

ఉట్నూర్, నవంబర్ 4 : గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఐటీడీఏ ఏవో దామోదరస్వామి అన్నారు. సోమవారం ఐటీడీఏ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో గిరిజన దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు పింఛన్లు, రెండు పడక గదుల ఇండ్లు, ఉపాధి అవకాశాలు కావాలని, వ్యవసాయ పనిముట్లు, భూ సమస్యల పరిష్కారానికి అర్జీలు పెట్టుకోగా.. పరిశీలించి ఆయా శాఖలకు బదిలీ చేయడం జరిగిందన్నారు. ఈ ప్రజావాణిలో ఏపీవో పీటీజీ మెస్రం మనోహర్, ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి, జేడీఎం నాగభూషణం, పేసా కో-ఆర్డినేటర్ వసంత్‌రావు, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఫిర్యాదులను స్వీకరిస్తున్న నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

## నిర్భయంగా ఫిర్యాదులను సమర్పించాలి

**నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల**

నిర్మల్ అర్బన్, నవంబర్ 4 : మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ప్రజలు నిర్భయంగా తమ ఫిర్యాదులను పోలీసులకు సమర్పించవచ్చని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లాలోని ఫిర్యాదుదారుల నుంచి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీదారులను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు సంబంధిత పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి పోలీసులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.